# పిలుపు

ఈ ఎండాకాలం సెలవుల్లో మనం తిరుపతికి వెళ్తున్నామంతే! "అంది నిర్మల. ఎంతో దృఢంగా ఉన్నాయి ఆమె మాటలు.

మణ్యం ఇడ్లీ తింటున్న వాడల్లా ఆపేసి ఆమెవేపే దీనంగా, నిస్సహాయంగా మొహం పెట్టి చూసేడు.

అంటే - తను అందాక చేసిన వాదనలూ, నివేదనలూ అన్నీ విఫలమయ్యా యన్నమాట! కించిత్తు పరితాపం చెందినవాడయి, మళ్లీ ఓసారి ప్రయత్నించి చూద్దాం అన్నట్టు - మరింత దీనంగా, మరింత నిస్సహాయంగా మొహాన్ని వేలాడేసుకుని - "ప్లీజ్, నిమ్మీ... నాకు ఏ మాత్రం వీలున్నా మీతో పాటు రానా... ఏ చేద్దాం. నా కర్మకొద్దీ ఈ రెవిన్యూలో ఉద్యోగం చేస్తున్నా, అందులోనూ ఇప్పుడున్నది కలెక్టరాఫీసులోనాయె, పైగా మా ఆఫీసరూ, ఆపై ఆఫీసర్లూ అంతా చండశాసనులు!" అంటూ ఏకరువు పెడుతూ వుంటే...

నిమ్మికి అరికాలి నించీ మండింది... "అయ్యా! మహానుభావా! నువ్వు చెబుతున్న దాంట్లో ఒక్కటన్నా కొత్తమాట ఉందా! నిన్నటినుంచీ పాడుతున్న పాతపాటేగా! ఇట్లాంటి కుంటి సాకుల్ని నేను వప్పుకోను గాక వప్పుకోను... ఏమిటీ? రెవిన్యూ, రెవిన్యూ అంటూ నన్ను భయపెడుతున్నావ్! మీ ఆఫీసర్లకి మాత్రం పెళ్ళాం పిల్లలూ ఉండరా? వాళ్లని ఏ ఊర్లకూ వాళ్లు తీసికెళ్లరా!" అంటూ నడుం మీద చేతులు ఉంచుకుని సీరియస్‌గా అడిగింది నిర్మల.

మరేం మాట్లాడాలో తోచలేదు మణ్యానికి.

మామూలుగా అయితే పది ఇడ్లీల్ని అలవోకగా తినేసేవాడు. నిమ్మి అలా బాధిస్తోంటే తిన బుద్ధి అవట్లేదు. మూడింటితోనే ముగించేశాడు. చకచక బట్టలేసుకుని ఆఫీసుకి బయల్దేరి వెళ్లిపోయాడు.

మణ్యం పూర్తిపేరు సుబ్రమణ్యం. ఉద్యోగం - సీనియర్ సహాయకుడు. తన సర్వీసులో ఏ సంవత్సరంలోనూ యాదృచ్ఛిక సెలవుల్నీ, ఐచ్ఛిక సెలవుల్నీ పూర్తిగా వాడుకున్న పాపాన పోలేదు. ఇక అర్జిత సెలవుల్నీ, మెడికల్ సెలవుల్నీ వాడుకోవచ్చు అన్న విషయమే జ్ఞాపక ముండదు అతనికి. తక్కిన ప్రాపంచిక విషయాలకంటే ఉద్యోగాన్నే తన సర్వస్వంగా భావించడమే అతనలా వుండడానికి అసలు కారణం.

ఏదయినా అత్యవసరమైన పని ఉండీ, ఒక్కరోజు క్యాజువల్ లీవు (యాదృచ్ఛిక సెలవు) పెట్టాడే అనుకోండి. ఆ పనేదో ఓ గంటలో అయిపోయింది అనుకుందాం. ఇక హాయిగా ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకోడు. అట్లా వుంటే అతను సుబ్రమణ్యం ఎట్లా అవుతాడు. మరి మణ్యం ఏం చేస్తాడు? తిన్నగా ఆఫీసుకెళ్లి తన సీట్లో కూచుని ఫైళ్ళు రాసుకుంటాడు. అందుకే అతని కొలీగ్స్ - "సుబ్రమణ్యాన్ని శిక్షించాలంటే కొట్టే పనిలేదూ, తిట్టే పనిలేదు. నాలుగు రోజులు క్యాజువల్ లీవు గ్రాంటు చేసి, లీవు అయిపోయే వరకూ ఆఫీసు ఆవరణలో కనబడకూడదని ఉత్తర్వులు వేస్తే చాలు. ఆ మనిషి ఒడ్డున పడిన చేపలా గిలగిల తన్నుకుని చస్తాడు" అంటూ వేలాకోలాలాడుతూ వుంటారు.

❁ ❁ ❁ ❁

మణ్యం తన సీటులో కూచుని ఫైలు రాసుకుంటున్నాడే కాని మనసు మనసులో లేదు. నిర్మల మాటలు చెవుల్లో గింగిర్లు కొడుతున్నాయి. అసలీ మనిషికి ఇంతోటి పట్టింపు ఎందుకొచ్చిందో అర్థం కావడం లేదు. ఆ ముందురోజు రాత్రి ఆ మాట అన్నందుకే... "ఈ పద్దెనిమిదేళ్లూ నీ గురించి పట్టించుకోకనే ఇట్లా తయారయ్యావు. మన పెళ్లయిన నాటి నించీ ఏ మార్పులేదు, నీలో. ఏనాడన్నా సెలవుపెట్టి ఒక్క ఊరు చూపించావా? మా ఇద్దరు తమ్ముళ్లకీ పెళ్లిళ్ళయితే అప్పుడు కూడా నువ్వు రాలేదు. నేనే పిల్లల్తో వెళ్ళొచ్చాను. నిన్నిట్లాగే వదిలేస్తే - నడుస్తున్న ఫైలులాగానో, లేకుంటే కదిలే పర్సనల్ రిజిష్టరు లాగానో జీవిస్తావు తప్ప, నాకు మొగుడిగానూ, నా పిల్లలకు తండ్రిగానూ ఉండేందుకు అర్హత కోల్పోతావు. సో... నిన్ను అంత సులభంగా వదల్ను..." అంటూ తనని దులిపి పారేసింది. ఆ సన్నివేశమంతా గుర్తొచ్చి కొంచెం వణికాడు మణ్యం.

'అసలు ఎందుకన్నా పెళ్లి చేసుకున్నానా?' అని ఇప్పుడిప్పుడే అనిపిస్తూ ఉందతనికి. అంకితభావంతో ఉద్యోగం చేయాలనుకుంటే పెళ్లి అనవసరం! అందుకే ప్రాచీన కాలంలో రుషులూ, సన్యాసులూ పెళ్లిళ్ళు చేసుకునే వాళ్లు కారుట. పద్దెనిమిదేళ్ళ కిందట తను చేసిన ఒక పొరపాటు ఈరోజు నిలదీసి దబాయిస్తూంది!

భుజం మీద చేయి పడితే తలెత్తి చూశాడు మణ్యం.

మల్లేశ్వర్రావు నవ్వుతూ... "మరీ అంత పరధ్యానమా? పదిసార్లు పిలిచాను" అన్నాడు. అతను మణ్యానికి సీనియరే అయినా, టెస్టులు ఏవీ పాసవనందువల్ల జూనియర్ సహాయకుడిగానే వుండిపోయాడు.

తనని ఇబ్బంది పెడుతున్న విషయాన్నంతా చెప్పేశాడు మణ్యం...

"ఓస్ అంతేనా... ఏంది సుబ్రమణ్యం? ఈ పని ఎప్పుడూ ఉండేదే... మనది కలెక్టరాఫీసు కాబట్టి అన్నీ అర్జెంటు రెఫరెన్సులే వస్తుంటాయి. అటు సి.ఎల్.ఆర్. (కమీషనర్ ఆఫ్ ల్యాండు రెవిన్యూ) ఆఫీసు నించీ, ఇటు స్పెషల్ కమీషనర్ ఆఫీసునించీ, లేదంటే

హైకోర్టునించీ... వాటి అన్నిటి మీదా డి.ఆర్.ఓ గారో, జాయింట్ కలెక్టరుగారో 'పుటప్‌టుడే' 'అనో' 'పుటప్ అట్ వన్స్' అనో రాస్తూనే వుంటారు. 'టేకిట్ ఈజీ మేన్! పెళ్లాం అంత సీరియస్‌గా చెప్పేదాకా మొగుడనేవాడు ఉండకూడదు. వచ్చే శుక్రవారం శ్రీరామనవమి, తర్వాతి రోజు రెండో శనివారం. ఆనక ఆదివారం, ఇంక సోమవారం అంబేద్కర్ పుట్టిన రోజు ఇట్లా నాలుగు రోజులు వరసగా పబ్లిక్ హాలిడేస్ వచ్చాయి. మంగళవారం ఒక్కరోజు క్యాజువల్ లీవు పెట్టావనుకో. హాయిగా తిరుపతికి పెళ్లాం పిల్లల్తో వెళ్లి రావచ్చు" అంటూ ఉత్సాహపరిచేడు మల్లేశ్వరరావు.

అందాకా గుండెల మీదున్న పది టన్నుల బరువును దూది పింజల్లా తీసి పక్కకు పెట్టిన మల్లేశ్వరరావు గొప్ప ఇంద్రజాలికుడిలా కనిపించేడు మణ్యానికి.

మధ్యాహ్నం ఇంటికి వెళుతూనే తిరుపతికి తనూ వస్తున్నట్టు నిర్మలకి చెప్పేశాడు. వెంటనే తిరుపతిలో వుంటున్న అతని చెల్లెలు శారదకి ఫోన్ చేసి శుక్రవారం ఉదయం అక్కడికి చేరుకోనున్నట్టు చెప్పేశాడు కూడా! ఆ సాయంత్రమే రైలు స్టేషనుకు వెళ్లి సెకెండ్ క్లాస్ బెర్తుల్ని రిజర్వు చేయించుకుని వచ్చేశాడు.

అయితే 'సింహం' అయిదు రోజుల సెలవు గ్రాంటు చేస్తుందా? అన్న దిగులే పట్టుకుంది ఆ రోజునించీ, మణ్యానికి.

'సింహం' అంటే ఆ ఆఫీసులో అందరికీ అర్థమైపోతుంది. అది ఆఫీసరుగారి పేరులో రెండో సగం అని. ఆఫీసరు పూర్తిపేరు 'నరసింహం'. అతనిలో నరుని లక్షణాలు ఏకోశాన లేవని తెలుసుకున్న సిబ్బంది ఆ పేరులోని రెండో సగాన్నే పిలుచుకుంటూ ఉంటుంది. అసలు సింహం ఆకలిగొన్నప్పుడే జంతువుల్ని వేటాడి తింటూ వుంటుంది. కానీ, ఈ 'సింహం' ఎల్లప్పుడూ వేటాడకుండానే సిబ్బంది మెదళ్లను తినేస్తుంటుంది. ఆ సింహం' ఎప్పుడో ఓసారి అవసరమైతేనే గర్జిస్తుంది. మరి ఇది ఎప్పుడుపడితే అప్పుడు గర్జిస్తూనే ఉంటుంది. అయితే ఇందులో చిన్న మినహాయింపు ఉంది. అదేమిటంటే - అసలే సాధు జంతువయిన 'మణ్యం' ఒక్కడూ సింహాన్ని ఏ మాత్రం గర్జించనీయకుండ పనిచేస్తూ వుంటాడు.

❁ ❁ ❁ ❁

అదిగో ఇదిగో అనుకుంటూ ఉన్నట్టే గురువారం రానే వచ్చింది. అంటే ఆ సాయంత్రమే మణ్యం కుటుంబ సమేతంగా తిరుపతికి బయల్దేరాల్సిన రోజు అన్నమాట.

గుండెకాయని ఒక చేతిలో పట్టుకుని, సెలవు చీటీని మరో చేతిలో పట్టుకుని ఆ వేళ ఉదయం సింహం వున్న గుహలోకి (క్షమించాలి ఆ గుహని ఆంగ్లంలో ఆఫీసర్స్ ఛేంబర్ అంటారు) ప్రవేశించేడు మణ్యం. తను ఎందుకు గానూ సెలవు పెడుతున్నదీ సవినయంగా చేతులు కట్టుకుని మరీ చెప్పేడు.

'సింహం' తన సహజ స్వభావంతో గర్జించబోయింది. మరి సాధు జంతువు వెళ్తానంటున్నది తిరుపతాయె! అసలే సింహానికి, కొంచెం దేవుడి సెంటుమెంటు ఎక్కువ. దాంతో వచ్చినట్టు క్యాజువల్ లీవుని మంజూరు చేసింది. అయితే చిన్న ఫిటింగు ఒకటి పెట్టింది. ఏమనీ... ఒకవేళ సాయంత్రంలోగా మణ్యం సీటుకు సంబంధించిన అర్జెంటు లెటరు ఏదయినా హైదరాబాదునించి వస్తే గనుక దానికి సంబంధించిన వివరాలు

వెంటనే పంపాల్సివుంటుంది. కాబట్టి సెలవును కాన్సిలు చేయబడును. ఇదీ ఆ ఫిటింగు తాత్పర్యం. 'మణ్యం' ఆఫీసరు మాటకు సరేనన్నట్టు తల ఆడించేసి వచ్చేశాడు.

ఆరోజు సాయంత్రంలోగా హైదరాబాదు నించి ఏ పేపరూ, ఏ ఉత్తరం డీ.ఆర్.ఓ. గారు తనకు ఇవ్వకుండా చూడవలసిందిగా ఏడుకొండల వాడిని నిమిష నిమిషానికీ మొక్కుకోవడంలో వున్నాడు మణ్యం. ఆ ఏడుకొండలవాడు మణ్యం మనవిని ఆలకించినట్టున్నాడు. అందుకేనేమో సాయంత్రం వరకూ ఏ అర్జెంటు ఉత్తరాన్నీ డీ.ఆర్.ఓ. గారు పిలిచి ఇవ్వలేదు.

మణ్యం ఇంటి కొచ్చేటప్పటికి అయిదున్నర అయింది. రాత్రి ఏడుగంటల నలభై అయిదు నిమిషాలకి పాకాల వెళ్లే రైలు వస్తుంది. కాబట్టి ఏడింటికల్లా ఇంటి నించీ బయల్దేరాలి.

❁ ❁ ❁ ❁

రాత్రి ఏడు గంటలకి పది నిముషాలు తక్కువగా వుంది...

రైల్వేస్టేషనుకి బయల్దేరేందుకు ఆటోని తీసుకురావడానికి మణ్యం సిద్ధమవుతూ వున్నాడు.

సరిగ్గా అప్పుడు 'ట్రింగ్... ట్రింగ్...' మంటూ ఫోన్ రింగయింది.

దాన్ని ఎత్తాలా, వద్దా... కొంచెం తటపటాయించాడు మణ్యం. ఎందుకో కీడును శంకిస్తూ ఉంది అతని మనసు. ఆ ఫోన్ కలెక్టరాఫీసునించీ 'డీ.ఆర్.ఓ.' గారిదే అయితే ఎట్లా? తను సెలవు పెట్టిన విషయం తర్వాతి రోజుకి గానీ ఆయనకి తెలిసే అవకాశం లేదు. ఏమి చేయడం.

ఇంకా రింగవుతూనే ఉంది ఫోను...

ఎన్నోసార్లు సరిగ్గా ఇదే వేళప్పుడే 'డీ.ఆర్.ఓ' గారి నుంచీ – అర్జెంటు పేపరుంది వెంటనే ఆఫీసుకి రా' అంటూ ఫోన్ వచ్చింది. అందుకే దాన్ని ఎత్తనే కూడదు అనుకున్నాడు.

"ఫోన్ అట్లా రింగయితాంటే ఎవరూ ఎత్తరే... మాధవీ, గోపీ..." అంటూ వంటింట్లోనించీ నిర్మల కేక పెట్టింది. రైల్లో తినాల్సిన భోజనాన్ని వైరు బుట్టలో ప్లాస్టిక్ పాకెట్ల రూపంలో సర్దుతూ వుందామె.

ఆ ఫోన్ చేస్తున్నది ఎవరో ఏమిటో తనెందుకు ఫోనెత్తకుండా వుండాలి. ఛీఛీ... తనేమిటీ ఇంత పిరికివాడయిపోతున్నాడు. తనేమైనా దొంగగా తిరుపతికి వెళుతున్నాడా? ఝుమ్మని దొరలాగ సెలవుపెట్టేసి మరీ వెడుతున్నాడు. ఇలా అనుకునేటప్పటికీ బోలెడంత ధైర్యం వచ్చేసిందతనికి వెంటనే ఫోన్ ఎత్తి 'హలో' అన్నాడు.

"ఏమండీ! మీ పక్కింట్లో ఉంటున్న రాయుడి గారి భార్యని పిలుస్తారా!" అంటూ ఆడగొంతు వినబడింది.

"రాంగ్ నెంబరండీ! మా పక్కింట్లో ఆ పేరు గల వాళ్లెవరూ లేరు." అనేసి ఫోన్ పెట్టేశాడు మణ్యం.

మళ్లీ వెంటనే "ట్రింగ్... ట్రింగ్"

తనే ఫోనెత్తాడు.

"మీ పక్కింట్లో రాయుడిగారి..." అని వినబడగానే –" మీరు తిరిగి మా నెంబరుకే డయల్ చేశారు." అంటూ ఫోన్ పెట్టేశాడు. ఆటోని తీసుకురావడానికి అడుగు బయట పెడుతూ ఉంటే మళ్లీ ఫోన్ రింగయింది.

"మాధవి! ఫోన్ ఎత్తమ్మా!" అన్నాడు.

అద్దంముందు తల దువ్వుకుంటూ ఉన్న ఆ పిల్ల గబగబా వచ్చి ఫోన్ ఎత్తి 'హలో' అంది. వెంటనే – 'నాన్నా! నీకే... మీ డీఆర్ఓ గారి కేంప్ అసిస్టెంటు" అంది.

వరండాలో చెప్పులేసుకుంటున్న వాడల్లా గిరుక్కున వెనక్కి తిరిగేడు. అతని గుండె ఒక్కసారి ఆగినట్లయి రెట్టింపు వేగం పుంజుకుని కొట్టుకోసాగింది. తను అనుకున్నంతా అయింది. ఇంకేముంది, తనని అర్జెంటుగా కలెక్టరాఫీసుకి రమ్మంటారు. ఏదో అర్జెంటు ఫైలు రాయాలంటారు. ఛఛ... దరిద్ర ఉద్యోగం... తన సర్వీసులో మొదటిసారిగా తన ఉద్యోగం మీద అసహ్యం కలిగింది మణ్యానికి.

తిట్టుకుంటూనే ఫోన్ అందుకున్నాడు.

"సార్! డీఆర్ఓ గారు మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నారు."

"ఎందుకు అనిల్! ఏమిటి విషయం?" తన అసహనాన్నంతా అణిచేసుకుని నెమ్మదిగా అడిగేడు.

"ఏమోసార్! తెలీదు"

మెల్లగా తను ఎందుకు సెలవుపెట్టిందీ, ఎన్నాళ్ళు పెట్టిందీ వివరించేడు మణ్యం – అనిల్‌కి.

"నేనేమో చెబుతాను సార్! ఆయనకి మూడ్ బాగుంటే ఫర్వాలేదు. లేదంటే... ఇక్కడ ఎవరు పని చేస్తారండీ, లీవ్ క్యాన్సిల్ చేసుకుని రమ్మను అంటూ కేకలేస్తే నేనేం చేయలేను." అన్నాడు అనిల్.

"సరే అయితే ఓ పని చెయ్యి అనిల్! సుబ్రమణ్యం గారి ఇంటికి ఫోన్ చేసినాను కాని ఎవరూ ఎత్తలేదు సార్!" అని మాత్రం చెప్పు, రేపటికి ఎలాగూ నా సెలవు సంగతి డీఆర్ఓ గారికి తెలిసిపోతుంది. ఈ ఒక్కసాయం చెయ్యవయ్యా చాలు!" అంటూ అతన్ని రిక్వెస్టు చేసుకున్నాడు మణ్యం.

"సరే సార్! ట్రై చేస్తా!"

అవతల ఫోన్ పెట్టేసిన చప్పుడు.

❁ ❁ ❁ ❁

రైలు వేగంగా ముందుకు దూసుకుపోతూ వుంది... చీకటిలో.. మణ్యం ఆలోచనలు మాత్రం వెనుకకి పరుగులు తీస్తున్నాయి. తను అనిల్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు అక్కడికి దగ్గర్లో డీఆర్ఓ గారు ఉన్నారో ఏమో, తన ముందు ఆ విషయం కనుక్కుని తర్వాత అబద్ధం ఆడమని ఉంటే బావుండేదేమో. కర్మకాలి డీఆర్ఓ గారికి అసలు సంగతి తెలిసిందా తన పని గోవింద!

భర్తని ఓ కంట గమనిస్తూనే ఉంది నిర్మల. అతనికి కొంచెం సర్దిచెప్పాలని చూసింది. అయితే అతన్ని ఆవహించిన గిల్టీఫీలింగ్‌ని వదిలించాలంటే ఏ మానవ మాత్రుడికీ

చేతనయ్యే పనికాదని అయిదు నిమిషాల్లో అర్థమయిందామెకు. తిరుపతికి చేరుకున్నాక అతనే సర్దుకుంటాడులే అని ఊరకనే ఉండిపోయింది.

❋ ❋ ❋ ❋

మరుసటి రోజు ఉదయం తిరుపతికి చేరుకున్నారు, మణ్యం, అతని కుటుంబం.

ఆ వేళ మధ్యాహ్నం భోజనాలు అయ్యాక నాలుగు రోజులలో ఏఏ ఊర్లు, ఏఏ గుళ్లు ఎప్పుడెప్పుడు చూడాలో అంతా వివరంగా చర్చించాడు మణ్యం బావమరిది నారాయణ. అందర్లోకి పరధ్యానంగా ఉంటున్నదీ, చిరాగ్గా వుంటున్నదీ ఒక్క మణ్యమే! అతను పడగ్గదిని వదిలి రావడంలేదు. సిగరెట్లు గొలుసు కట్టుగా కాలుస్తున్నాడు. అందర్తోనూ కలిస్తే మనసు కుదురుగా వుంటుందని నచ్చ జెప్పి చూసింది నిర్మల.

"నీ వల్లనే నాకు చెడ్డ పేరు వచ్చేట్టుంది మా డీఆర్ఓ గారి దగ్గర. ఎంత పని చేశావే.. నా మానాన నన్ను అక్కడే వదిలేసి వుంటే" అన్నాడు మణ్యం చిరాగ్గా.

ఇదంతా గమనిస్తూ వున్న అతని చెల్లెలూ, బావమరిదీ అతన్ని కదపాలంటే భయపడిపోయారు.

మరుసటి రోజు అద్దె జీపు తీసుకొని తిరుమలకి వెళ్లి శ్రీవారి దర్శనం చేసుకుని రాత్రికల్లా తిరిగి వచ్చారు. ఆ మరుసటి రోజున కాణిపాకం వినాయకుడిని చూసి వచ్చారు. మణ్యం మరబొమ్మలా కదలుతున్నాడే తప్ప, మనిషిలా మాటలూ, నవ్వులూ లేవు. ఎంతసేపూ గాల్లోకి చూడటం, సిగరెట్లు తాగటం... ఏ హోటల్లోనయినా వాళ్లంతా టిఫిన్లో, భోజనాలో చేస్తున్నప్పుడు హోటల్ వాళ్ల ఫోన్ మోగిందా – "ఫోన్ ఎత్తకండి... ఒక్కవేళ ఎత్తితే నేను లేనని చెప్పండి. ఆ ఫోన్ డీ.ఆర్.ఓ గారి నించే వచ్చుంటుంది. అవును... అందుకే ఎత్తకండి!" అంటూ గొణుక్కోవడం నిర్మల పసిగట్టింది.

ఆ రాత్రి భోజనాలు అయ్యాక సిగరెట్లు తాగుతూ వున్నాడు మణ్యం. మరో రెండు రోజులుంది సెలవు... ఆ తర్వాత తను ఆఫీసుకి మామూలుగా వెళ్లగలడా?

ఆఫీసుని తలుచుకుంటూనే, 'డీఆర్ఓ' గారు జ్ఞాపకానికి వస్తున్నారు. అట్లా జ్ఞాపకం వస్తూనే మనసంతా బరువెక్కి పోతోంది. నిజానికి ఎంతో అర్జెంటు పని ఉంటే గాని తనకోసం ఫోనురాదు. ఏ హైకోర్టు నుంచో, సుప్రీంకోర్టునుంచో పేరా వైజ్ రిమార్కులు రాసి పంపమని లేఖ వచ్చిందో ఏమో! అట్లా రాసి వెంటనే పంపకపోతే కలెక్టరుగారికి మాట వచ్చేస్తుంది. అప్పుడు తన పరిస్థితి ఏమిటీ? డీఆర్ఓ గారు, లేదంటే జాయింటు కలెక్టరు గారు ఆ తప్పిదానికి తనని సస్పెండ్ చేయనూవచ్చు. లేదంటే ఒకటి రెండు ఇంక్రిమెంట్లు కోత పెట్టనూవచ్చు. అట్లా అనుకుంటూ వుంటే 'గుండెల్లో దడ పుట్టుకొస్తోంది'

అరెరె... నిజంగానే గుండె దడగానే వుందే...

అవును నిజంగా గుండె దడే...

"లబ్ డబ్... డబ్ డబ్... లబ్" అరె చిత్రం... తన గుండె ఏమిటి క్రమ పద్ధతి లేకుండా...

ఇర్రెగ్యులర్ హార్ట్ బీటింగ్ అంటే ఇదేనా... "లబ్‌లబ్... డబ్‌డబ్‌డబ్..."

అంతే... అతనికి 'పులి' పోయి 'గిలి' అంటుకుంది. అంటే తనకి గుండె జబ్బు వచ్చిందా... ఏమిటిది గుండెల్లో మంట! అంతేకాదు నొప్పిగా కూడా...

ఇది కచ్చితంగా గుండె నొప్పే!!

దేవుడా... ఇది గుండె నొప్పి కాకూడదు...

నేను హార్టు అటాక్‌తో చావకూడదు. దేవుడా... దేవుడా... నిర్మల అమాయకురాలు... దానికీ, పిల్లలకీ నన్ను దూరం చేయకు.

క్షణక్షణానికీ గుండెల్లో నొప్పి ఎక్కువవుతూ వుంది. ఒళ్లంతా ఒకటే చెమటలు!

అట్లా అనుకుంటూనే కళ్లు మూసుకున్నాడు." ఎప్పుడు నిద్రపట్టేసిందో... మరుసటిరోజు పది గంటల బస్సుకు బయల్దేరి సాయంత్రానికల్లా అనంతపురానికి చేరుకున్నారు - అందరూ.

❀ ❀ ❀ ❀

పొద్దున్నించీ నిర్మల ఒక కంట మొగుడిని గమనిస్తూనే ఉంది...

"ఫోన్ రింగయితే చాలు భయపడి పోతావు - మీ ఆఫీసరుకి ఏం పనీ పాటలూ ఉండవా, నీకు ఫోన్ చేసి హడలుగొట్టడమే పనా? కొంచెం ధైర్యంగా ఉండబ్బా! ఏమయితాది. ఇంతకీ మీ డీఆర్‌ఓ నిన్ను ఏం జేస్తాడసలూ... సస్పెండ్ చేస్తాడా - చేయనీ, డిస్మిస్ చేస్తాడా? చేయనీ... ఏం ఫర్వాలేదు. నేనున్నాను. పదిండ్లలో పాచిపని చేసయినా సరే సంసారాన్ని సాకుతా..." అంది నిర్మల. అసలతనికి ఏ మూలలోనన్నా కించిత్తయినా ధైర్యమనే పదార్థం ఉంటేనా...

అదురుతున్న గుండెలతోనే పదిన్నరకి ఆఫీసుకి చేరుకున్నాడు మణ్యం. తిరుపతి ప్రయాణం గురించి కొలీగ్స్ అడిగితే పొడిపొడిగా సమాధానాలు చెప్పాడు. ఏ క్షణంలోనైనా డీఆర్‌ఓ పిలుస్తారేమోనన్న ఆలోచన అతన్ని ఏ పనీ చేయనీయడంలేదు.

"సార్ డీఆర్‌ఓ సారు మిమ్మల్ని రమ్మన్నారంట!" అంటూ అటెండరు ఓబులేసు చెప్పాడు.

అంతే, పై ప్రాణాలు పైన్నే ఎగిరిపోకుండా వడిసి పట్టుకుని, కాళ్లలో వస్తున్న వణుకుని ఎవరికీ కనబడనీయకుండా అడుగులు వేస్తూ డీఆర్‌ఓ గదికి చేరుకున్నాడు. డిఆర్‌ఓ ఏదో ఫైలు చూస్తూ ఉన్నాడు.

"నమస్తే సార్!" అన్నాడు మణ్యం, గొంతు కీచుపోయింది.

డీఆర్‌ఓ తలెత్తి - "ఏమయ్యా సుబ్రమణ్యం! శుక్రవారం కబురుచేస్తే - లేవు" అన్నారు. ఆయన మొహంలో ఏ ఫీలింగూ పలుకలేదు.

"సా... సార్! అవున్సార్! నేను సెలవుపెట్టి పోయినాను సార్!"

"సర్లేవయ్యా! అందుకే ఫోన్ చేయించాను - అనిల్‌తో... ఏదో టంగుటస్కు చెప్పి తప్పించుకున్నావ్!"

"సార్! అదేం లేదు సార్! ముందుగానే రిజర్వు చేయించుకున్నందువల్ల... సారీ సార్! అయామ్ వెరీ సారీ సార్... అవునూ ఏదయినా అర్జెంటు పనా సార్!" అంతా అయిపోయింది. తనకు అంతిమఘడియలు దాపురించాయి.

"ఇప్పుడు చెప్పి ఏం లాభం... మా అమ్మాయికి తిరుపతి లడ్డు అంటే ప్రాణం... నాలుగు లడ్డులు నీతో తెప్పించుకుందామనుకున్నా..." అంటూ డీఆర్‌ఓ ఓ ఫైలు చూడ్డంలో ఉండిపోయారు.

మణ్యం మొహం చూడాలి అప్పుడు.

● సాహిత్య నేత్రం త్రైమాసిక - జూలై, 2006 ●